నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I హైదరాబాద్, బుధవారం 26 ఫిబ్రవరి 2025 SANGAREDDY

## ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఎండుతున్న పంటలు

- తపాస్‌పల్లి రిజర్వాయర్ నింపాలి
- సాగునీరివ్వకుంటే రైతులతో కలిసి ఆందోళనలు చేస్తాం
- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్, ఫిబ్రవరి 25: ప్రభుత్వ నిర్లక్ష్యంతో కొండపాక మండలంలో యాసంగి పంటలు ఎండిపోతున్నయని, ప్రభుత్వం వెంటనే తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు గోదావరి జలాలను పంపింగ్ చేసి సాగునీరు అందించాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం సకాలంలో రిజర్వాయర్లను గోదావరి జలాలతో నింపి ఎండాకాలం ప్రారంభంలోనే కాలువల ద్వారా కొండపాక మండలంలోని గ్రామాలకు సాగునీళ్లు అందించిందని గుర్తుచేశారు. మండలంలోని కొండపాక, దమ్మక్కపల్లి, సిరిసనగండ్ల, మర్పడగ, ఖమ్మంపల్లి, తిమ్మారెడ్డిపల్లి, గిరాయిపల్లి, జప్తినాచారం, దుద్దెడ గ్రామాల్లో సాగునీళ్లు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారని, పొలాలు ఎండిపోతున్నాయని రైతులు అధికారులకు ఫోన్ చేసినా కనీసం స్పందించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో 200 మీటర్ల టన్నెల్ తొలిచారని, ప్రభుత్వం మారడంతో పనులు మధ్యలోనే ఆపేశారన్నారు. టన్నెల్ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మల్లన్నసాగర్ నుంచి కొండపాక మండలంలోని చెరువులను నింపి, సిద్దిపేట నియోజకవర్గంలోని నంగునూర్ మండలానికి సాగునీళ్లు అందించే అవకాశం ఉందన్నారు. తపాస్‌పల్లి టన్నెల్‌ను వెంటనే పూర్తి చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగినట్లు తెలిపారు. జగదేవ్‌పూర్ కెనాల్ నుంచి మునిగడప చెరువులోకి నీళ్లు వచ్చేలా చూడాలన్నారు. సాగునీళ్లు వదలని పక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని వంటేరు ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు.

## నేటినుంచి ఏడుపాయల జాతర



జాతరకు ముస్తాబైన ఏడుపాయల ఆలయం

పాపన్నపేట, ఫిబ్రవరి 25: తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల దుర్గామాత సన్నిధిలో నేటినుంచి మూడు రోజుల పాటు జరిగే జానపదుల జాతరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి జాతరను ప్రారంభిస్తారు. జాతరకు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర,ఆంధ్రప్రదేశ్ నుంచి సుమారు 15లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. జాతర మొదటి రోజు శివరాత్రి సందర్భంగా భక్తులు మంజీరా నదిలో పుణ్యస్నానాలు చేసి దుర్గమ్మను దర్శించుకొని శివదీక్షలు చేపడతారు. సాయంత్రం దీక్షలు విరమిస్తారు. గురువారం ఎద్దుల బండ్లు తిరిగే కార్యక్రమం అద్భుతంగా కొనసాగుతుంది. మొదట పాపన్నపేట సంస్థానాధీశుల బండి తిరగగా మిగతావి దాన్ని అనుసరిస్తాయి. ఉత్సవాల మూడో రోజు శుక్రవారం రథోత్సవం జరుగుతుంది. హైదరాబాద్, సికింద్రాబాద్, జోగిపేట, సంగారెడ్డి వైపు నుంచి వచ్చే భక్తులు నర్సాపూర్ మీదుగా పోతన్‌శెట్టిపల్లి నుంచి నూతన బ్రిడ్జిల మీదుగా ఏడుపాయలకు చేరుకోవాలి. మెదక్ వైపు నుంచి వచ్చేవారు ఇదే మార్గం గుండా వెళ్లాల్సి ఉంటుంది. జహీరాబాద్, బీదర్, నారాయణఖేడ్ వైపు నుంచి వచ్చే భక్తులు బొడ్మట్‌పల్లి మీదుగా నాగసాన్‌పల్లి కమాన్ నుంచి ఏడుపాయలకు చేరుకోవాలి. హైదరాబాద్, నర్సాపూర్, జోగిపేట వైపు నుంచి వచ్చే భక్తులు తమ వాహనాలను రెండో బ్రిడ్జి వద్ద పార్కింగ్ చేసి జాతరకు వెళ్లాల్సి ఉంటుంది. నారాయణఖేడ్ వైపు నుంచి వచ్చే వారు చెలిమెల కుంట వద్ద పార్కు చేయాల్సి ఉంటుంది.



ఆకునూరులో ట్యాంకర్ నుంచి నీటిని పట్టుకుంటున్న మహిళలు

## నీటి ట్యాంకరే దిక్కాయే..!

**మేజర్ గ్రామ పంచాయతీ ఆకునూరులో తాగునీటి సమస్య**


చేర్యాల, ఫిబ్రవరి 25: కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నీటి సమస్యలు తలెత్తుతుండంతో గ్రామాలు, పట్టణాల్లో మళ్లీ నీటి ట్యాంకర్లు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ హయాంలో ఏదో ఫంక్షన్ జరిగితే తప్పా మిగతా రోజుల్లో నీటి ట్యాంకర్లు కనిపించేవి కావు. చేర్యాల మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ ఆకునూరుకు మూడు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్ అయ్యింది. 12 వార్డులు, 8వేల జనాభా ఉన్న ఈ గ్రామస్తులు నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవి ప్రారంభంలోనే తాగునీటి సమస్య రావడంతో వారు డైరెక్ట్ పంపింగ్ ఉన్న సిస్టర్న్‌ల వద్దకు వెళ్లి నీటిని బిందెలతో మోసుకొస్తున్నారు. తాగునీటి సమస్య తలెత్తడంతో ప్రజలు నుంచి తీవ్రమైన వ్యతిరేకత రావడంతో చేసేది లేక గ్రామ పంచాయతీకి సంబంధించిన నీటి ట్యాంకర్‌తో పాటు అదనంగా మరో ట్యాంకర్‌తో వార్డుల వారీగా పంచాయతీ అధికారులు నీటిని సరఫరా చేస్తున్నారు.ట్యాంకర్ రాగానే ఒక్కసారిగా మహిళలు బిందెలు, బకెట్లు తదితర వాటిని పట్టుకుని ట్యాంకర్ల వద్ద సిగపట్లు పడుతున్నారు. గతంలో సమయానికి మిషన్ భగీరథ నీరు రావడంతో మహిళలకు ఇబ్బందులు ఎదురుకాలేదు. ఇప్పుడు మహిళలు వారి పనులు వదులుకుని ట్యాంకర్ ఎప్పుడు వస్తుందో అని ఎదురు చూస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే మిషన్ భగీరథ నీటి సరఫరాను పునరుద్ధరించాలని పలువురు ఆకునూరు గ్రామస్తులు కోరారు. ఇప్పటికే మండలంలోని కాశేగుడిసెల గ్రామంలో తాగునీటి కోసం గ్రామస్తులు తండ్లాడుతున్నారు. ఇప్పుడు ఆకునూరులోనూ నీటి సమస్య తలెత్తింది. మున్ముందు నీటి సమస్య ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**మెదక్ జిల్లాలో 50శాతం రైతుల ఖాతాల్లోనే జమ**

# రైతుభరోసాకు ఎదురుచూపులు!

**పెండింగ్‌లో రూ.105 కోట్ల రైతుభరోసా.. జిల్లాలో మొత్తం 2,91,399 మంది రైతులు**

- ఇప్పటి వరకు 2,06,472 రైతుల ఖాతాల్లో రూ.126.35 మాత్రమే జమ
- ఎదురుచూస్తున్న అన్నదాతలు



మెదక్, ఫిబ్రవరి 25(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బంధు పథకం కేంద్ర ప్రభుత్వంతో పాటు అనేక రాష్ట్రాలను ఆకర్షించి వారు అమలు చేసేలా చేసింది. ఐక్యరాజ్యసమితి మన్ననలు సైతం పొందింది ఈ పథకం. కేసీఆర్ సీఎం ఉన్నన్ని రోజులుగా ఏటా యాసంగి, వానకాలం రెండు పంటలకు సమయానికి రైతుల ఖాతాల్లో రైతు బంధు జమచేసేవారు. దీంతో రైతులకు పెట్టుబడి కష్టాలు తీరాయి. వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే బాధలు తప్పాయి. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారు రైతుబంధును రైతుభరోసాగా పేరు మార్చి అమలు చేస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎకరాకు రూ.5వేల చొప్పున రెండు పంటలకు కలిపి ఏటా రూ.10వేలు అందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా పథకం కింద ఎకరాకు రూ.6వేల చొప్పున ఇస్తామని చెప్పి అమలులో ఆలస్యం చేస్తున్నది. గతనెల 27న ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించి మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసింది. ఆ గ్రామంలోనే రైతు భరోసా నగదును రైతుల ఖాతాల్లో జమచేసింది. దీంతో మిగతా గ్రామాల రైతులు రైతు భరోసా సాయానికి ఎదురుచూస్తున్నారు.

**మెదక్ జిల్లాలో రూ.105 కోట్లు పెండింగ్**

రైతు భరోసా సాయం కొందరికే అందింది. ఇప్పటి వరకు మూడు ఎకరాల్లోపు రైతులకు మాత్రమే నగదు జమ అయింది. ప్రభుత్వం మూడు ఎకరాల్లోపు రైతుల ఖాతాల్లో డబ్బులు వేశామని చెబుతున్నది. బ్యాంక్‌కు వెళ్లి రైతులు తమ అకౌంట్‌లో చూస్తే రైతు భరోసా డబ్బులు రాలేదని పలువురు రైతులు వాపోతున్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో మాత్రం ఎన్ని ఎకరాలు ఉన్నా నగదు అందింది. తర్వాత ఎకరా, రెండు, మూడు ఎకరాల్లోపు రైతులకు విడతల వారీగా నగదు జమ చేస్తోంది. కానీ, ఇంకా ఎకరం, రెండు, మూడు ఎకరాల్లోలోపు ఉన్న కొందరికీ నగదు జమ కాకపోవడంతో బ్యాంకుల చుట్టూ రైతులు ప్రదక్షిణ చేస్తున్నారు. ఎందుకు రైతు భరోసా డబ్బులు పడలేదని వ్యవసాయ శాఖ అధికారులను ప్రశ్నిస్తున్నారు. వివిధ కారణాలతో నగదు జమ కాలేదని అధికారులు సమాధానం ఇస్తున్నారు. మూడు ఎకరాలకు పైబడి భూమి ఉన్న రైతులు వేల సంఖ్యలో ఉన్నారు.. నాలుగో విడత ఎప్పుడు వస్తుందోనని రైతు భరోసా కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. మెదక్ జిల్లాలో మొత్తం 2,91,399 మంది రైతులు ఉన్నారు. వీరికి రూ. 231,85,45,057 డబ్బులు ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 2,06,472 మంది రైతులకు రూ. 126,35,44,611 ఖాతాల్లో జమ అయ్యింది. ఇంకా 84,927 మంది రైతులకు రూ.105 కోట్ల రైతు భరోసా జమ కావాల్సి ఉంది. ఇప్పటి వరకు మూడు ఎకరాల వరకు ఉన్న రైతులకు రైతు భరోసా అందించామని ప్రభుత్వం చెబుతున్నా, అది క్షేత్రస్థాయిలో అందరు రైతులకు అందలేదని తెలిసింది. ఈ లెక్కన పది ఎకరాలు ఉన్న రైతులకు సాగు సాయం అందాలంటే మరో రెండు నెలల సమయం పడే అవకాశం ఉంది.



శేషవాహన సేవలో పాల్గొన్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, పోలీసు అధికారులు, భక్తులు

## వైభవంగా శేషవాహన సేవ

ఝరాసంగం, ఫిబ్రవరి 25: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వరాలయంలో మహాశివరాత్రి నవాహ్నిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి వారికి రుద్రభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ మూర్తులను శేషవాహనంపై పురవీధుల గుండా ఊరేగించారు. భక్తులు దారి పొడగునా మంగళ హారతులతో దర్శించుకుని నీరాజనాలు పలికారు. రాత్రి పల్లకి సేవ, భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఆలయ కార్యనిర్వహణాధికారి శివరుద్రప్ప, జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, సీఐలు శివలింగం, జక్కుల హనుమంతు, ఎస్ఐ నరేష్, గ్రామపెద్దలు హన్మంత్ రావు పాటిల్, ఉదయ్ శంకర్ పాటిల్, ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## బుధేరాలో ఘోర రోడ్డు ప్రమాదం

- రోడ్డు ప్రమాదంలో తల్లి, కొడుకు, కోడలు మృతి
- కన్నీరుమున్నీరైన చిన్నారులు

మునిపల్లి, ఫిబ్రవరి 25 : ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని బుధేరాలో ముంబయి జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. మునిపల్లి ఎస్సై రాజేశ్ నాయక్ వివరాల ప్రకారం.. మునిపల్లి మండలంలోని అంతారం గ్రామానికి చెందిన పిచ్చకుట్ల లక్ష్మి(54), రవి(32), శోభారాణి(28) కలిసి మంగళవారం ముంబయి జాతీయ రహదారి మీదుగా కంకోల్ వైపు నుంచి సదాశివపేట వైపు బైక్‌పై బయలుదేరారు. బుధేరా చౌరస్తాలోని ఫ్లైఓవర్‌పై వద్ద గుర్తుతెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టడంతో ముగ్గురు ఘటనా స్థలంలోనే మృతిచెందారు. మృతుడు రవికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతులు లక్ష్మి, రవి తల్లీకుమారులు కాగా, మృతురాలు శోభారాణి మృతుడు రవి భార్య. తల్లిదండ్రులతో పాటు నానమ్మ చనిపోవడంతో రవి ఇద్దరు కుమారులు విలపించారు. వారి రోదనలు అందరినీ కదలించాయి. తల్లిదండ్రుల మృతితో ఆ చిన్నారులు అనాథలుగా మారారు.



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఒకే కుటుంబ సభ్యులు

## పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

**27న గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు**

- సంగారెడ్డి జిల్లాలో 68 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- 25652 పట్టభద్రుల ఓటర్లు, 2690 టీచర్ ఓటర్లు
- పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసిన 63 మంది
- 460 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు
- ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ వల్లూరు క్రాంతి సమీక్ష



సంగారెడ్డిలో ఎన్నికల ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి, ఫిబ్రవరి 25(నమస్తే తెలంగాణ): ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంగారెడ్డి జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మెదక్ –కరీంనగర్ –నిజామాబాద్ –ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇంకా ఒక్కరోజు మిగిలి ఉండడంతో ఎమ్మెల్సీ అభ్యర్థులు ఎవరికివారే గెలుపు వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఈనెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సంగారెడ్డి జిల్లాలో గ్రాడ్యుయేట్ ఓటర్లు 25625, టీచర్స్ ఓటర్లు 2690 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రతి మండలంలో ఒక పోలింగ్ కేంద్రంతో పాటు మున్సిపాలిటీల్లో రెండు నుంచి ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రాడ్యుయేట్ ఓటర్ల కోసం 40 పోలింగ్ కేంద్రాలు, టీచర్స్ ఓటర్ల కోసం 28 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 376 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. 93 మంది పోలింగ్ ఆఫీసర్లు, 87 మంది ఏపీవోలు, 196 మంది ఓపీవోలు ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. జిల్లాలోని 68 పోలింగ్ కేంద్రాలకు బుధవారం సాయంత్రం వరకు పోలింగ్ సిబ్బందితోపాటు సామగ్రి చేరుకోనున్నది. ఇందుకోసం సంగారెడ్డి, అందోలు, జహీరాబాద్, నారాయణఖేడ్‌లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 74 పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు ఉండగా, మంగళవారం వరకు 63 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ పరిశీలించేందుకు మైక్రోఅబ్జర్వర్లను నియమించారు. మైకో అబ్జర్వర్లు, ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ ముగిసింది. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 460 మంది పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తులో పాల్గొనున్నారు. నలుగురు డీఎస్పీలు, 10 మంది సీఐలు, 16 మంది ఎస్ఐలు, 70 మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 330 మంది పోలీసు కానిస్టేబుళ్లు, 20 మంది ప్రత్యేక పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. జిల్లా ఎస్పీ రూపేశ్ బందోబస్తు ఏర్పాట్లను మంగళవారం సమీక్షించారు. ఓట్ల లెక్కింపు మార్చి 3న కరీంనగర్‌లో జరుగుతుంది.

### ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్...

ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ సిబ్బంది, మైకో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్‌ను సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పూర్తిచేశారు. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో ఆమె సమీక్షించారు. ఈనెల 27న జరగనున్న పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలోని 68 పోలింగ్ కేంద్రాల్లో 25652 గ్రాడ్యుయేట్ ఓటర్లు, 2690 టీచర్ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాలున్న విద్యా సంస్థలకు 26, 27న సెలవు ప్రకటించినట్లు తెలిపారు. 27న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. పోలింగ్ ముగిసన అనంతరం బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత మధ్య కరీంనగర్‌లోని రిసెప్షన్ సెంటర్‌కు తరలిస్తామని తెలిపారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, డీఈవో వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏవో పరమేశం తదితరులు ఉన్నారు.



గుమ్మడిదలలో తహసీల్ కార్యాలయం వద్ద దున్నపోతులకు వినతి పత్రం అందజేస్తున్న రైతు, మహిళా జేఏసీ నాయకులు



సంగారెడ్డిలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆ పార్టీ నాయకులు, జేఏసీ నాయకులు

## మా ఆందోళనలు ప్రభుత్వానికి పట్టవా

**డంపింగ్‌యార్డు ఏర్పాటుపై సర్కారు స్పందించాలి**

- మొద్దునిద్ర వీడి మాకు న్యాయం చేయాలి
- జేఏసీ డిమాండ్.. దున్నపోతులతో నిరసన
- గుమ్మడిదలలో హైవేపై ర్యాలీ
- తహసీల్ కార్యాలయం వద్ద వినూత్న ప్రదర్శన
- గుమ్మడిదలలో 15వ రోజు దీక్షలో కూర్చున్న ఏకలవ్య కులస్తులు
- నల్లవల్లిలో 21 రోజు దీక్ష చేపట్టిన రజక సంఘం సభ్యులు
- ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరించిన రైతు జేఏసీ



గుమ్మడిదలలో జాతీయ రహదారిపై దున్నపోతులతో ర్యాలీ నిర్వహిస్తున్న రైతు జేఏసీ నాయకులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 25: ప్యారానగర్ డంపింగ్‌యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ 21 రోజులుగా సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించకపోవడంపై బాధిత గ్రామాల ప్రజలు, జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం దున్నపోతైనా స్పందిస్తుంది, కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదని మంగళవారం గుమ్మడిదలలో దున్నపోతులతో హైవేపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం దున్నపోతులకు వినతి పత్రాన్ని అందజేసి వినూత్న నిరసన తెలిపారు. గుమ్మడిదలలో రైతు, మహిళా జేఏసీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి, ఇందుల మల్లమ్మ ఆధ్వర్యంలో దున్నపోతులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ప్రభుత్వం మొద్దునిద్ర, మొండిపట్టుదలను వీడి డంపింగ్ యార్డు ఏర్పాటును విరమించాలని డిమాండ్ చేశారు. దున్నపోతులకు ఫ్లకార్డులు తగిలించి నిరసన తెలిపారు. సేవ్ ఫారెస్ట్, సేవ్ ఫార్మర్ అంటూ నినాదాలు చేశారు. గుమ్మడిదల దీక్షా శిబిరంలో ఏకలవ్య కులస్తులు రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్యారానగర్–నల్లవల్లిలో 21వ రోజు రిలే నిరాహార దీక్ష కొనసాగింది. రజక సంఘం సభ్యులు దీక్ష చేపట్టారు. ఆనంద్, సురేశ్, వెంకటేశ్, ఆశయ్య, చంద్రయ్య, నరేశ్, దాసు, కుమ్మరి ఆంజనేయులు, ఫయాజ్ షరీఫ్, కొత్తపల్లి మల్లేశ్ గౌడ్ దీక్ష చేపట్టారు.

**జిల్లాకేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం...**

డంపింగ్‌యార్డును ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలంటూ సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు చుక్కా రాములు, నాగేశ్వర్‌రావు, రాజయ్య, ప్రజాసంఘాల నాయకులు,కొత్తపల్లి మల్లేశ్‌గౌడ్ రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్కా రాములు మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు పోరుకు ప్రజాసంఘాలతో కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వానికి, గ్రీన్ ట్రిబ్యునల్‌కు, పర్యావరణ శాఖకు, పీసీబీ శాఖకు నివేదించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం దిగిరాకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

**ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరిస్తున్నాం: జేఏసీ నాయకులు**

ఈనెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను గుమ్మడిదల మండలంలోని పట్టభద్రులు బహిష్కరించాలని నిర్ణయించారు. ఈ మేరకు రైతు జేఏసీ నాయకులతో కలిసి తీర్మానం చేశారు. మండలంలో 291 మంది పట్టభద్రులు,19 మంది టీచర్ ఎమ్మెల్సీ ఓట్లు ఉన్నాయి. మంగళవారం రైతుజేఏసీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి అధ్యక్షతన అఖిలపక్షం ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తాము డంపింగ్‌యార్డును వ్యతిరేకిస్తున్నట్లు ఈ సందర్భంగా మండలంలోని పట్టభద్రులు తెలిపారు. ప్రజలు ఉధృతంగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడంతో తాము ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు వేయవద్దని నిర్ణయించుకుని తీర్మానం చేసుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు తేల్చి చెప్పారు. డంపింగ్‌యార్డుతో నర్సాపూర్ నియోజకవర్గానికి ముప్పు ఉందని, అక్కడి పట్టభద్రులు కూడా ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరించాలని రైతు జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అఖిలపక్ష పార్టీల నాయకులు పుట్టనర్సింగ్‌రావు, నరేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, తులసీదాసు, ప్రభాకర్‌రెడ్డి, మద్దులబాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఐలేశ్, రాజిరెడ్డి, రాంరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, స్వేచ్ఛారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, విష్ణురెడ్డి, వీరారెడ్డి, శ్రవణ్ పాల్గొన్నారు.



గుమ్మడిదల మండలం నల్లవల్లిలో 21వ రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టిన రజక సంఘం సభ్యులు



గుమ్మడిదలలో రిలే నిరాహార దీక్ష చేపట్టిన ఏకలవ్య సంఘం సభ్యులు, రైతు జేఏసీ నాయకులు